భరోసా లేని బతుకులు

- కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న 406 మంది సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు
- అదనపు బాధ్యతలతో సతమతం
- ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్



గొల్లపల్లి మండల విద్యావనరుల కేంద్రం

గొల్లపల్లి: ఎస్ఎస్ఏలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న సిబ్బంది వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కనీస వేతనాలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు. పైగా అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నారు. ఏళ్లుగా తమ శ్రమను గుర్తించడం లేదని వాపోతున్నారు. ఇది గొల్లపల్లి మండలంలోని పరిస్థితి. ఎస్ఎస్ఏ(సమగ్ర శిక్షా అభియాన్)లో సీఆర్పీలు(క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్), ఎంఐఎస్(మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్) కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్స్(అటెండర్స్) కాంట్రాక్టు పద్ధతిన 2003 నుంచి పని చేస్తున్నారు. 56 పాఠశాలలకు క్లస్టర్లకు గాను 77 మంది సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 17 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 18, మెసెంజర్లు 18, ఐఆర్పీలు 20, పీటీఐ 70, డీఎల్ఎంపీ 1, టెక్నికల్ పర్సన్ 1, కంప్యూటర్ ఆపరేటర్లు 2, ఏఎస్‌సీ 1, ఏపీవో 1, కేజీబీవీ ఉద్యోగాల్లో ఎస్‌వో 12, సీఆర్‌టీ 84, సీవో 12, ఏఎన్ఎంలు 12, పీఈటీలు 12, నాన్‌టీచింగ్ స్టాఫ్ 48 మంది పని చేస్తున్నట్లు రికార్డుల్లో ఉంది. ఈ వ్యవస్థ 2001 నుంచి ప్రారంభమైంది. సీఆర్పీలు మండలానికి నలుగురి నుంచి ఐదుగురి వరకుంటారు. అయితే క్లస్టర్‌కు ఒకరి చొప్పున ఉంటారు. ఎంఐఎస్‌లు ఎంఈవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తారు. ఎంఈవో ఎక్కడికి వెళ్తారో అక్కడికి వెళ్లి ఆయన చెప్పేవన్ని రికార్డు చేస్తారు. ఆపై డేటా ఎంట్రీ చేయిస్తారు. ఇక్కడే డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తారు. సీఆర్పీలు పని చేసే చోటే మెసెంజర్లు కూడా ఉంటారు. అందరూ సైతం ఉదయాన్నే 8 గంటలకు వెళ్లి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తారు. సీఆర్పీలు, ఎంఐఎస్‌లు ఎప్పటికప్పుడూ పాఠశాలలను తనిఖీ చేస్తారు. విధులకు ఉపాధ్యాయులు గైర్హాజరైతే వీరే బోధన చేస్తారు. రోజూ ఎంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చారనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. విద్యార్థుల పరీక్షకు అవసరమైన ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలను అందజేస్తారు. పాఠశాలల పరిశీలన, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు దగ్గర పడుతుండటంతో.. అందరూ తప్పనిసరిగా విధుల్లో ఉండాల్సిందేనని తెలుస్తోంది.

డిమాండ్లివే..

వారందరూ కూడా కనీస వేతనాలు రూ.35వేలివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులరైజ్, టీఏలు, డీఏలు మంజూరు చేయాలంటున్నారు. ఆరోగ్య భద్రతను కల్పించాలంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తమకు కూడా సమాన పనికి సమాన వేతనమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రతి సంవత్సరం ఉద్యోగంలో కొనసాగాలంటే ప్రతి ఏడాది మార్చి నెలలో సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుందని వాపోతున్నారు. కాగా ఎస్ఎస్ఏ సంఘం వారి తరఫున తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

కనీస వేతనమివ్వాలి



పెరిగిన అవసరాలరీత్యా కుటుంబ పోషణ భారంగా మారింది. కనీస వేతనంతో పాటు ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు. అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నాం. ఇప్పటి ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

– లచయ్య, సీఆర్పీ, గొల్లపల్లి

నిబంధనల ప్రకారమే వేతనాలు



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎస్ఎస్ఏ సిబ్బందికి వేతనాలు మంజూరు చేస్తాం. ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తే అప్పుడే వారివారి అకౌంట్లలో డబ్బులు జమ చేస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

రాయికల్ దంత వైద్య నిపుణులుగా ప్రవీణ్‌చంద్ర

రాయికల్: రాయికల్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో దంత వైద్య నిపుణులుగా డాక్టర్ ప్రవీణ్‌చంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు సూపరింటెండెంట్ రవి తెలిపారు. పట్టణ, మండల ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన నియామకం

పెగడపల్లి: పద్మశాలి సేవాసంఘం నందగిరి గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోట మల్లేశం ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. యువజన సంఘం అధ్యక్షుడిగా పన్నాటి గంగాధర్‌ను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గాజుల గంగమల్లేశం అధ్యక్షతన ఈ ఎన్నికలు నిర్వహించారు.

కూలీల వేతనాలు చెల్లించాలి



చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కూలీలు

రాయికల్: పట్టణంలోని అవెన్యూ ప్లాంటేషన్‌లో తాత్కాలిక కూలీలతో మొక్కలు నాటించినందుకు గాను కూలీలకు వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఒడ్డెరకాలనీకి చెందిన కూలీలు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ సంతోష్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి మాట్లాడుతూ.. 2021 నుంచి కూలీలకు డబ్బులు అందడం లేదని, వెంటనే న్యాయం చేయాలని కోరారు.

బాల్క సుమన్‌కు గుణపాఠం తప్పదు



అయిలాపూర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కోరుట్లరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెప్పుతో కొడతానంటూ దూషించిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కోరుట్ల నియోజకవర్గానికి వస్తే తగిన గుణపాఠం చెపుతామని కాంగ్రెస్ కోరుట్ల మండల అధ్యక్షుడు కొంతం రాజం అన్నారు. అయిలాపూర్, పైడిమడుగు గ్రామాల్లో బాల్క సుమన్ వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం సుమన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. జిల్లా కార్యదర్శి ఎర్దండి మోహన్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, సీనియర్ నాయకులు చింతకుంట సంజీవరెడ్డి, ఎలేటి పుల్లారెడ్డి, తాటికొండ బాబు, రామకృష్ణ, స్వామి, రాములు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

పెగడపల్లి: బాల్క సుమన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పెగడపల్లి రెడ్డి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నర్సింహారెడ్డి, గంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మూడో రోజుకు విజ్ఞప్తి దీక్ష



రవికుమార్‌కు మద్దతు తెలుపుతున్న అక్షయ్‌కుమార్

ధర్మపురి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని బీజేపీ నాయకుడు రాయిల్ల రవికుమార్ చేపడుతున్న విజ్ఞప్తి దీక్ష గురువారం మూడో రోజుకు చేరింది. ధర్మపురిలోని తహసీల్ కార్యాలయం సమీపంలో మంగళవారం విజ్ఞప్తి దీక్షను ప్రారంభించగా.. 2023 శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మేకల అక్షయ్‌కుమార్ గురువారం రవికుమార్‌ను శాలువాతో సన్మానించి మద్దతు పలికారు.

బావి చుట్టూ ఉన్న చెట్ల తొలగింపు

గొల్లపల్లి: నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉన్న మంచినీటి బావిని పంచాయతీ అధికారులు వినియోగంలోకి తెచ్చారు. లక్ష్మీపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీకి నీటిని అందించే పంచాయతీకి సంబంధించి బావి చుట్టూ తుమ్మచెట్లు పెరగడంతో నిరుపయోగంగా మారింది. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎంపీటీసీ గోవిందుల లావణ్య, జలపతి అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మానాల మహేందర్, ప్రత్యేకాధికారి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా.. జేసీబీ సహాయంతో పిచ్చిమొక్కలను తొలగించారు. ఉపయోగంలోకి తేవడంతో ఎస్సీ కాలనీవాసులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యదర్శి జీవన్, గ్రామస్తులు దావు కొండయ్య, వెంగళదాస్ సత్తయ్య, ప్రశాంత్, విజయ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

నేడు చిలుక చిన్నమ్మ జాతర



మల్లాపూర్: సంగెం–శ్రీరాంపూర్‌లో శుక్రవారం చిలుకల చిన్నమ్మ జాతరకు ఏర్పాట్లు చేశారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్‌తోపాటు నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి మల్లన్న జాతర ఉత్సవాలు

కోరుట్లరూరల్: సంగెం గ్రామ మల్లన్న ఆలయంలో జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఆలయంలో ఆచారమంతుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

ధర్మపురి: పట్టణంలోని మోరోల్ల వాగు వద్ద నిర్వహించనున్న సమక్క–సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒడ్డెర కుల సంఘం అధ్యక్షుడు ఒల్లెపు శంకర్‌రాజు ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. గురువారం అమ్మవార్ల గద్దెలను శుభ్రం చేసి రంగులతో అలంకరించారు.

దేవాలయం వరకు పాదయాత్ర



జగిత్యాలరూరల్: మహాశివరాత్రి పురస్కరించుకొని గురువారం ఉదయం జగిత్యాల పట్టణం పురాణిపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పొలాస గ్రామ శివారులోని సహస్ర వెయ్యి లింగాల దేవాలయం వరకు భక్తులు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాదయాత్రలో పాల్గొని సహస్ర వెయ్యి లింగాల దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకుడు నలమాసు గంగాధర్ పాల్గొన్నారు.

బీర్‌పూర్ ఘాట్ రోడ్డు మరమ్మతులు ప్రారంభం



సారంగాపూర్: బీర్‌పూర్ ఘాట్ రోడ్డుకు గురువారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెలలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇటీవల బీర్‌పూర్ గ్రామంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పర్యటించారు. బీర్‌పూర్ ఘాట్ ఎక్కే సమయంలో(ఆర్‌వీ ప్రధాన కాలువ) దాదాపు 300 మీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలు, కంకర తేలి, తారు పోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారిందని బీర్‌పూర్ మండల ప్రజలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్సీ ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ.. రోడ్డుపై త్వరలో తారు వేయనున్నట్లు తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం గర్వకారణం



మల్లాపూర్: న్యూఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్‌లో యశస్విని పాల్గొనడం వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాలకు గర్వకారణమని ఫిషర్మెన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రొడ్డ రాజు అన్నారు. గురువారం వీవీరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో వెంకట్రావ్‌పేట తాజా మాజీ సర్పంచ్ జోగుల మమతతో కలిసి గిరిజన విద్యార్థిని యశస్వినిని ఘనంగా సన్మానించారు. గత నెల 26న న్యూఢిల్లీ రిపబ్లిక్ డేలో రాష్ట్రపతి ముర్ము, ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రుల సమక్షంలో నిర్వహించిన పరేడ్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున వేంపల్లికి చెందిన యశస్విని పాల్గొని పేరు తెచ్చిందని కొనియాడారు. నాయకులు గుగ్లావత్ రాజేందర్, తోట మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



ఎర్దండిలో పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా పనులను చేపట్టాలని ప్రత్యేకాధికారులు రఘువరన్, ప్రసాద్ గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నంలో ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో రఘువరన్ పనులను పరిశీలించారు. ఎర్దండి గ్రామంలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రసాద్ పనులను పరిశీలించారు. కార్యదర్శులు మనోజ్, సాయినాథ్, పంచాయతీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెగడపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్ కోరారు. పంచాయతీల్లో పత్యేక అధికారుల పర్యవేక్షణలో గుంతల పూడ్చివేత, రోడ్లకిరువైపులున్న చెట్లను తొలగించడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్దార్ ఎంఏ ఫరూక్, డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రెగ్యులర్ డీఈవోను నియమించాలి

జగిత్యాల: జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ వినతి పత్రం అందజేశారు.

నిరంకుశ ధోరణి మానుకోవాలి

జగిత్యాలటౌన్: కేరళ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ ధోరణి అనుసరిస్తూ అణచివేతకు గురి చేయడం మానుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సంఘీభావ ర్యాలీ అనంతరం పార్టీ కార్యాలయంలో సంఘీభావ సభ నిర్వహించారు. నాయకులు రమేశ్, చంద్రయ్య, శేఖర్, సలీం, రఫిక్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ కార్యక్రమాలను వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: సెర్ప్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా సెర్ప్ ఫైనాన్స్ అధికారిణి విజయ భారతి, జిల్లా సెర్ప్ మార్కెటింగ్ అధికారి మల్లేశం అన్నారు. బుధవారం మండల సెర్ప్ కార్యాలయంలో సెర్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, గంగాధర్, శ్రీనివాస్, విద్యాసాగర్, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలకు సిద్ధం కావాలి

మల్లాపూర్: రాబోయే ఎంపీ, స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. సిరిపూర్‌కు చెందిన దామెర రాజశేఖర్‌రెడ్డి కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమవ్వగా.. గురువారం దామెర రాజశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. వాల్గొండ గ్రామ శాఖ అధ్యక్షుడు దండవేని నర్సయ్య, నాయకులు గంగిని శ్రీనివాస్, కోరే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల్లేని డబుల్ ఇళ్లు

జగిత్యాలటౌన్: మౌలిక వసతుల్లేకుండా డబుల్ ఇళ్లకు ఎమ్మెల్యే పట్టాలు ఇప్పించడం పేదలను వంచించడమేనని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. తాగునీరు, విద్యుత్, మురుగు కాలువల వంటి సౌకర్యాలు లేవని లబ్ధిదారులు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి

కథలాపూర్: కథలాపూర్‌లో మోడల్ స్కూల్ రోడ్డు సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు ఆకుల సంతోష్, జవ్వాజి రవి గురువారం తెలిపారు. వానాకాలంలో ఈ రోడ్డు జలమయమై ఉపాధ్యాయులు, విద్యార్థులు కాలినడకన వెళ్లడం కష్టమన్నారు.

ఇరువర్గాలకు కౌన్సెలింగ్

మెట్‌పల్లిరూరల్: ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాల్లో గౌడ కులస్తుల బహిష్కరణపై వీడీసీ సభ్యులు, గ్రామస్తులకు పోలీస్, రెవెన్యూ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఇరువర్గాలతో అధికారులు మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని, బహిష్కరణ అనేది చట్టవిరుద్ధమని హెచ్చరించారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్పా వివాదాలకు వెళ్లొద్దని సూచించారు. తహసీల్దార్ శేఖర్, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

కోరుట్ల: పట్టణ శివారులోని అర్బన్ హౌసింగ్‌కాలనీలో అనుమల్ల వెంకటరమణ అనే వ్యక్తి గురువారం సాయంత్రం హత్యకు గురి కాగా.. రాత్రి 8 గంటలకు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిరణ్ ఉన్నారు.

కౌన్సిలర్ల బెదిరింపులు మానుకోవాలి

మెట్‌పల్లి: పట్టణంలో నూతనంగా ఇళ్లు, వ్యాపార సముదాయాలు నిర్మించుకుంటున్నవారిని కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ ఆరోపించారు. పట్టణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు నూతనంగా కట్టడాలు చేపడుతున్నవారిని ప్లానింగ్ ప్రకారం నిర్మాణం చేపట్టడం లేదని, సెట్‌బ్యాక్ లేదంటూ మున్సిపల్ అధికారులను అడ్డుపెట్టుకొని అడిగినంతా డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. వెంకటేశ్, అరుణ్, రేవంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

జగిత్యాల: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ అన్నారు. గురువారం కార్యాలయంలో మాట్లాడారు. ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. నాయకులు రాహుల్, నాగరాణి, సౌమ్య, రంజిత్ పాల్గొన్నారు.

హిందూసమాజ పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలి



సాతారంలో పాల్గొన్న నాయకులు

మల్లాపూర్: హిందూసమాజ పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గజం రాజు అన్నారు. గురువారం సాతారంలో నిర్వహించిన సమావేశంలో విశ్వహిందూ, బజరంగ్‌దల్, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. దేశంలోని పౌరులందరూ సమానమేనని, ప్రజలందరూ ఒక కుటుంబంగా భారతమాత బిడ్డలేనని అన్నారు. సాతారం బజరంగ్‌దల్, విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీని ప్రకటించారు. బజరంగ్‌దల్ గ్రామ సంయోజక్(కన్వీనర్)గా సంకోజి పవన్, సహ సంయోజక్(కో–కన్వీనర్)గా కుంచం గణేశ్, గోరక్ష ప్రముఖ్‌గా శివరాత్రి అశోక్, విద్యార్థి ప్రముఖ్‌గా ఒల్లెపు హన్మాంత్, సురక్ష ప్రముఖ్‌గా కొప్పుల నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, బజరంగ్‌దల్ జిల్లా గోరక్ష ప్రముఖ్ పల్లికొండ వెంకటేశ్, విశ్వహిందూ, బజరంగ్‌దల్ మండల సంయోజక్ బండి జైపాల్, విశ్వహిందూ పరిషత్ మండల ఉపాధ్యక్షుడు చిలివేరి నవీన్, నాయకులు నాగేంద్ర, మారంపెల్లి తిరుపతి, కుర్మా రాజరెడ్డి, వడ్లకొండ ప్రభు, గట్ల గణేశ్, సంకోజి లింబాద్రి, మధు, రాహుల్, విఘ్నేశ్, సాయిగణేశ్, సాయిప్రసాద్, సూర్య, శేషు, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వెల్గటూర్: ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామ వ్యవస్థాపకుడు ఏలేటి రాజారాంపటేల్ జయంతి సందర్భంగా గురువారం పంచాయతీ ఆవరణలో శివకృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. మండల ప్రజలు బీపీ, షుగర్, ఈసీజీతో పాటు ఇతర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంతకుముందు రాజారాంపటేల్ విగ్రహం వద్ద ఎంపీడీవో సంజీవరావు, తహసీల్దార్ ఉదయ్‌కుమార్ నివాళి అర్పించారు. ఎంపీటీసీ మల్లేశం, ఎంపీవో శ్రీనివాస్, ఏలేటి వంశీయులు రాజారాంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాలటౌన్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు దిష్టిబొమ్మ దహనం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమి రమణకుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ పటిష్టతకు అనునిత్యం శ్రమిస్తున్న ఎంపీ అరవింద్ దిష్టిబొమ్మ దహనం చేసినవారిపై పార్టీ రాష్ట్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నలువాల తిరుపతి, సుంకెటి దశరథరెడ్డి, పెద్దబొడ్డు గంగారాం, జుంబర్తి దివాకర్, పవన్‌సింగ్, రాంరెడ్డి, బెజ్జంకి ప్రవీణ్, సాంబారి కళావతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపు సరికాదు

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీ నుంచి కార్మికుల తొలగింపు సరికాదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25 మంది కార్మికులను అకారణంగా తొలగించడంతో పట్టణం మురుగుకూపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ ఎద్దండి భూంరెడ్డి, నాయకులు బాపురపు నర్సయ్య, పడిగెల రవీందర్‌రెడ్డి, గన్నవరం ప్రభాకర్, మున్ను, షాకీర్, రాకేశ్‌నాయక్, మహిపాల్, దివాకర్, నరేశ్, భూమేశ్, బత్తిని భూమయ్య, దిలీప్, గంగాధర్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జగిత్యాల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్య, ఆరోగ్యం ముఖ్యమని ఐసీపీఎస్ అధికారి సురేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పురాణిపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాలల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై వివరించారు. హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

నరేంద్ర మోదీ పథకాలపై ప్రచారం



జగ్గాసాగర్‌లో కేంద్ర పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: కేంద్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా జగ్గాసాగర్ గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు మోదీ పాలన, కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరించారు. మండల అధ్యక్షుడు రాజ్‌పాల్ రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, జలంధర్, శంకర్, సంజీవ్, సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

రాయికల్: ఇటిక్యాల గ్రామంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలతో రూపొందించిన పోస్టర్‌ను బీజేపీ నాయకులు ఇంటింటా, దుకాణాల్లో పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ మహిపతిరెడ్డి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, నాయకులు తీపిరెడ్డి రాజశేఖర్, సత్యం, అంజి, సంజీవ్ రెడ్డి, రొట్టె శ్రీధర్, కిరణ్, వేణు, సంతోష్ పాల్గొన్నారు.

కోరుట్లలో..

కోరుట్ల: పట్టణంలోని 22వ వార్డులో బీజేపీ గావ్ చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ మాడవేణి నరేశ్, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు మహేశ్, సీనియర్ నాయకులు పీసరి నర్సయ్య, జక్కుల జగదీశ్వర్, రుద్ర శ్రీనివాస్, తులసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారికి సన్మానం

వెల్గటూర్: మండల కేంద్రం ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్‌ను తాజా మాజీ సర్పంచ్ మేరుగు మురళిగౌడ్ ఆధ్వర్యంలో వెల్గటూర్ కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో వెల్గటూర్ గ్రామంలో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి సందీప్‌రెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఉదయ్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేశ్‌గౌడ్, గుమ్ముల అజయ్, రేగుంట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం: యామపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఎంపీటీసీ బొరిగం వివేకవర్ధిని భూమిపూజ చేసి ప్రారంభించారు. గ్రామ ప్రత్యేకాధికారి సుకన్య, కార్యదర్శి దివాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకటి, ఎంపీటీసీలు తిమ్మణి రాములు, అక్కెనపెల్లి జలేశ్, మాజీ ఉప సర్పంచ్ బూస రాజేశ్, నాయకులు వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజరెడ్డి, సుదర్శన్, తలారీ అనంద్, బొరిగం మహేశ్, క్యాతం తిరుపతిరెడ్డి, పల్లె రాజన్న, లక్కిడి నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకానికి వివరాలివ్వండి

జగిత్యాలరూరల్: గృహజ్యోతి పథకానికి వినియోగదారులు విద్యుత్ ఉద్యోగులు అడిగిన సమాచారం ఇవ్వాలని ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలనలో అందజేసిన సమాచార ధ్రువీకరణ పత్రం తమ సిబ్బంది పరిశీలిస్తారని, ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆహారభద్రత కార్డు (రేషన్‌కార్డు నంబరు), అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిబ్బంది వచ్చినప్పుడు వినియోగదారులు అందుబాటులో లేకుంటే విద్యుత్ సహాయ ఇంజినీర్ కార్యాలయంలో, విద్యుత్ సహాయ గణాంక అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

టీషర్టుల పంపిణీ

వెల్గటూర్: మండల కేంద్రంలో దోరిశెట్టి వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న కొండాపూర్ గ్రామ క్రీడాకారులకు పీసీసీ మెంబర్, కాంగ్రెస్ ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి టీషర్టులు పంపిణీ చేశారు.